



దుర్గమ్మకు పట్టువస్త్రాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు

అటు కృష్ణానదీ ప్రవాహం.. ఇటు భక్తజన కోలాహలం.. రెండూ ఒకదానికి మించి ఒకటి పోటీపడ్డాయా.. అన్నట్టు సోమవారం ఇంద్రకీలాద్రికి భక్తజనసంద్రం పోటెత్తింది. జనం.. జనం.. ఎటుచూసినా ఒకటే జనం.. మూలానక్షత్రం, సరస్వతీదేవి అలంకారంలో కొలువైన అమ్మను దర్శించుకునేందుకు పోటీపడింది. ఆదివారం రాత్రి నుంచే తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు సోమవారం అర్ధరాత్రి దాటే వరకు కొనసాగారు. వినాయకుడి ఆలయం వద్ద క్యూలైన్లు దాటి అధికారులు ఏర్పాటుచేసిన దాదాపు 60 కంపార్టుమెంట్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల వెసులుబాటు దృష్ట్యా వీఐపీ దర్శనాలను రద్దు చేసిన అధికారులు.. సామాన్యులకు త్వరగా దర్శనమయ్యేలా చూశారు. ఒకదశలో దర్శనానికి 7 గంటల సమయం పట్టింది. సీఎం చంద్రబాబు సతీసమేతంగా దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించగా, ప్రముఖుల రాకపోకలు, కుంకుమార్చనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, నగరోత్సవంతో శరన్నవరాత్రి ఉత్సవాలు మరింత శోభాయమానంగా వెలిగాయి.



సోమవారం రాత్రి 10 గంటల సమయంలో కొండ దిగువన భక్తుల రద్దీ





జన వరద

భక్తజనసంద్రంగా మారిన ఇంద్రకీలాద్రి

మూలానక్షత్రం రోజు భారీగా భక్తుల రాక

ఆదివారం రాత్రి నుంచి మొదలైన రద్దీ ● క్యూలైన్లు దాటి కంపార్టుమెంట్ల వరకు..



క్యూలైన్లలో భక్తుల రద్దీ

- దాదాపు 60 కంపార్టుమెంట్లు కిటకిట
- దర్శనానికి దాదాపు 7 గంటల సమయం
- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం
- అర్ధరాత్రి 12.30 వరకు 2 లక్షల మంది దర్శనం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రి భక్తులతో నిండిపోయింది. స్నానఘాట్లు భవానీలతో ఎరుపెక్కాయి. ప్రకాశం బ్యారేజీ పరిసరాల్లో ఎటుచూసినా భక్తులే కనిపించారు. మూలానక్షత్రం, సరస్వతీదేవి అలంకారం కావడంతో ఆదివారం రాత్రి నుంచే భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంట మిగతా 6లో..



అమ్మ దర్శనం కోసం ఆరాటం



దుర్గమ్మ దర్శనం కోసం దివ్యాంగ భవాని



క్యూలైన్ల మధ్యలో ఆగిపోయిన అంబులెన్స్

సమ్మోహనోత్సవ్

- ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన మెలోడీ బ్రహ్మ మణిశర్మ



8

జోగి.. నానా యాగీ

స్వామి ప్రతిష్టను మరింత పెంచాలి

కృష్ణమ్మ ఉగ్రరూపం

ప్రకాశం బ్యారేజీ నుంచి 6.84 లక్షల క్యూసెక్కుల విడుదల

- పులిగడ్డ అక్విడెక్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద
- లంక గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న నీరు
- ముంపు భారీన వాణిజ్య పంటలు
- పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు
- క్షేత్రస్థాయిలో పర్యటించి అప్రమత్తం చేస్తున్న కలెక్టర్ బాలాజీ





మోపిదేవి మండలం కే.కొత్తపాలెం గ్రామంలోకి చేరిన వరద నీరు (ఇన్‌సెట్‌లో) వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/అవనిగడ్డ/చల్లపల్లి/మోపిదేవి/నాగాయలంక: ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి వరద భారీగా రావడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి 6.84 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో వరద ప్రవాహం సోమవారం తెల్లవారుజాము నుంచి మరింత పెరిగింది. పులిగడ్డ అక్విడెక్ట్ నీటమునిగింది. పులిగడ్డ అక్విడెక్ట్‌పై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు అక్విడెక్ట్ వద్ద ఇనుప గడ్డర్లను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టారు. మోపిదేవి మండలం కే.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు తదితర గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఈ గ్రామాల్లో కరకట్టకు, నదికి మధ్యన ఉన్న పొలాల్లో సాగు చేసిన కంద, పసుపు, అరటి, పూలు, కూరగాయల తోటలు మునిగాయి. కే.కొత్తపాలెంలో పాఠశాలలో పునరావాస శిబిరం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చల్లపల్లి మండలం నడకుదురు, రాముడుపాలెం, ఆముదార్లంక, లచ్చిగానిలంక, తదితర గ్రామాల పరిధిలోని కరకట్ట వెంబడి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని పసుపు, కంద, అరటి తోటల్లోకి వరద నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా నాగాయలంక మండలం చినకరకట్ట పక్కనే ఉన్న మిగతా 6లో..

నదిలో కలిసిపోయిన మరో ఇల్లు

కృష్ణానది వరదలతో కోతకు గురవుతున్న అవనిగడ్డ మండలం ఎడ్లంక దీవిలో మరో ఇల్లు నదిలో కలిసిపోయింది. గడచిన ఆరు సంవత్సరాలుగా కృష్ణానదిలో మార్పులు, చేర్పులతో ఎడ్లంక దీవిలో ప్రమాదకర స్థితిలో నది ప్రవహిస్తోంది. ఇప్పటికే 15 ఇళ్లు నదిలో కలిసిపోగా, ఎడ్లంక దీవి చుట్టూ దాదాపు 100 మీటర్ల లోపల వరకు పంట పొలాలు నదిలో మునిగిపోయాయి. పులిగడ్డ పల్లెపాలెం, సీతాలంక తదితర గ్రామాల్లోని పంట పొలాల్లోకి వదర నీరు వచ్చి చేరింది. సోమవారం మధ్యాహ్నం సమయంలో వరద ఉధృతి కొంతమేర తగ్గిందని, రానున్న మూడు రోజులపాటు వరద ఉధృతి ఆరు లక్షల క్యూసెక్కులకు తగ్గకుండా కొనసాగుతుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

కృష్ణానదికి సోమవారం వరద పోటెత్తింది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 6.84 లక్షల క్యూసెక్కుల విడుదల చేయడంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. పసుపు, కంద, అరటి, కూరగాయ తోటలు నీట మునిగాయి. పులిగడ్డ అక్విడెక్ట్‌పై నుంచి ప్రవాహం కడలి వైపు పరుగులు తీస్తోంది. అప్రమత్తమైన కలెక్టర్ బాలాజీ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

కదిలిన జిల్లా యంత్రాంగం


- డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైద్య బృందాల పర్యటన

6

క్రాస్ క్లోవర్ లీఫ్ రహదారి నిర్మాణంపై పునఃపరిశీలన చేయండి

కలెక్టర్ బాలాజీకి రైతుల విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి-65, జాతీయ రహదారి-216ను కలుపుతూ మచిలీపట్నం సమీపంలోని ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద చేపట్టనున్న క్రాస్ క్లోవర్ లీఫ్ రహదారి నిర్మాణంపై పునఃపరిశీలన చేయాలని కోరుతూ పలువురు రైతులు కలెక్టరేట్‌లో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీకి సోమవారం వినతిపత్రం అందించారు. మచిలీపట్నం సమీపంలో జాతీయ రహదారుల విస్తరణకు గతంలో తమ భూములను ఇచ్చినట్టు చెప్పారు. పోర్టు నిర్మాణం నేపథ్యంలో రెండు జాతీయ రహదారులను



గూడూరు నుంచి హర్ష కాలేజీ వరకు ఎలాంటి మలుపులు లేకుండా తయారు చేసిన జాతీయ రహదారి నమూనా

కలుపుతూ ఎస్ఎన్ గొల్లపాలెం సమీపంలో క్రాస్ క్లోవర్ లీఫ్ రహదారి నిర్మాణం చేసేందుకు మోర్త్ మిగతా 6లో..

కొండంత భక్తితో..

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2025

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి నక్షత్రం మూల కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం అర్ధరాత్రి 1.15 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. కంపార్టుమెంట్ల ద్వారా భక్తులను క్యూలైన్‌లోకి పంపారు. అమ్మవారి దర్శనానికి సుమారు ఆరు నుంచి ఏడు గంటల వరకు సమయం పట్టింది.



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు







కనకదుర్గమ్మ అనుగ్రహంతో పురోగతి దిశలో రాష్ట్రం

» కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ అనుగ్రహంతో రాష్ట్రం పురోగతి దిశలో పయనిస్తోందని కేంద్ర విమానయాన మంత్రి కె.రామ్మోహననాయుడు అన్నారు. సోమవారం ఆయన ఇంద్రకీలాద్రిపై సరస్వతిదేవి అలంకారంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఈవో శీనానాయక్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహం, సీఎం చంద్రబాబు సంకల్పంవల్లే ఏపీ బ్రాండ్ దేశవ్యాప్తంగా ఉందన్నారు.

విజయదశమి రోజున ఉచిత దర్శనం



\- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సోమవారం అమ్మవారిని సరస్వతిదేవి అలంకారంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అక్టోబరు 2న అన్ని క్యూలలో భక్తులకు ఉచితదర్శనం కల్పిస్తున్నామన్నారు. ఈ దసరా మహోత్సవాలలో సోమవారం రాత్రివరకు 8 లక్షలమంది భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారని తెలిపారు. దసరా పండుగ రోజు భక్తులకు ఉచిత లడ్డు ప్రసాదం అందజేయనున్నట్టు తెలిపారు.



సమన్వయంతో పనిచేయండి..

భవానీ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గగుడి ఈవో శీనా నాయక్‌ ఆదేశించారు. సరస్వతీదేవి అలంకారంలో కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరరం దసరా ఏర్పాట్లపై ఈవో, ఛైర్మన్‌లను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత దసరా ఉత్సవాలకు భవానీలు అధిక సంఖ్యలో వస్తున్నారు. భవానీలకు గతంలో అసౌకర్యాలు కలిగిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఈవోకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుత దసరా ఉత్సవాలు, రానున్నదీక్షల విరమణల నేపథ్యంలోనూ భవానీలు ఇబ్బంది పడకూడదని చెప్పారు. గుడిపై వీఐపీ దర్శనాలను కట్టడి చేయాలని ముఖ్యమంత్రి సీఎంవో ద్వారా ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఇప్పటికే దేవస్థానం అధికారులు భవానీల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

చిట్టినగర్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం సరస్వతీదేవి అలంకారంలో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు వంగలపూడి అనిత, పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, పలువురు న్యాయమూర్తులు ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు వీరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, ప్రత్యేక దర్శనం కల్పించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని, రాష్ట్ర ప్రజలకు శాంతి, సుభిక్షాలు కలగాలని అమ్మవారి దీవెనలు కోరుకున్నామని వారు పేర్కొన్నారు.



ఆదాయం రూ.2.54 కోట్లు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ దసరా మహోత్సవాలలో ఈనెల 22 నుంచి 28 వరకు ఏడురోజుల్లో దేవస్థానానికి రూ.2,54,58,881 ఆదాయం సమకూరినట్టు ఈవో శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.300 దర్శన టికెట్ల ద్వారా రూ.35,20,800, రూ.100టికెట్ల ద్వారా రూ.12,65,700, లడ్డు ప్రసాదం ద్వారా రూ 25,53,330 ప్యాక్ రూ.100 ద్వారా రూ 1,65,22,700 వచ్చినట్టు తెలిపారు. పరోక్ష ప్రత్యేకకుంకుమార్చన సేవ ద్వారా రూ.3,55,000 (టికెట్ రూ.3000), రూ 1.75లక్షలు(టికెట్ రూ.5000), చండీహోమం (రూ. 4000) ద్వారా రూ .76 వేలు, శ్రీచక్రనవావరణార్చనకు (రూ.3000) రూ.24 వేలు, ఖడ్గమాలార్చన ద్వారా రూ2,60,916 పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ. 39,920, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ. 6,46,480, ఇతరత్రా ఆదాయం రూ. 17,035 మేరకు వచ్చింది.

లడ్డూ ప్రసాదానికి డిమాండ్

» ఇప్పటి వరకు 14.71లక్షల లడ్డూల విక్రయం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దసరామహోత్సవాలలో దుర్గమ్మ లడ్డు ప్రసాదానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో దేవస్థానం అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉండగా.. సుమారు 30 లక్షల లడ్డులను కొత్త భవనం, బుద్దువారి కల్యాణమండపం, శృంగేరీమఠంపక్కన షెడ్డులో తయారీ కేంద్రాలలో సిద్ధం చేస్తున్నారు. ఆదివారం వరకు 11,96,095 లడ్డులను విక్రయించగా.. సోమవారం మూలానక్షత్రం సాయంత్రం వరకు 2.75 లక్షలు విక్రయించినట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా 14.71లక్షల లడ్డు ప్రసాదాలు భక్తులకు విక్రయించినట్టు తెలిపారు. ఇంకా 8 లక్షల లడ్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఆరు లడ్డూల ప్యాక్ రూ.100కు విక్రయిస్తున్నారు. ఈ ప్యాక్‌లను భక్తులు అత్యధికంగా కొనుగోలు చేస్తున్నారు. దేవస్థానం ఈవో, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌లు లడ్డుతయారీని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు.



కొండ దిగువన నూతన లడ్డుపోటులో లడ్డూ ప్రసాదం తయారీ



దుర్గమ్మను దర్శించుకున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కుటుంబసమేతంగా ఎంపి కేశినేని చిన్ని, మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, నక్కా ఆనంద్ తదితరులు



విజేతలతో మంత్రి రవీంద్ర, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

» నేటి నుంచి జాతీయ యోగాసన చాంపియన్ షిప్

మొగల్రాజపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న జాతీయ యోగాసన చాంపియన్ షిప్ పోటీలను మంత్రి సోమవారం సందర్శించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాతో మానసిక శారీరక ఆరోగ్యం సాధ్యమన్నారు. యోగా మన సంస్కృతి, వారసత్వ సంపద అన్నారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, విశాఖలో నిర్వహించిన యోగా డే స్ఫూర్తిగా రాష్ట్రంలో జాతీయ యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, రాష్ట్రయోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక తదితరులు పాల్గొన్నారు.

సీనియర్-సి విజేతలు

హ్యాండ్ బాలెన్స్ మహిళల వ్యక్తిగత విభాగంలో పి.ప్రసూన(ఏపీ) ఆష్మాదాస్(వెస్ట్‌బెంగాల్),పంపందేవి(గోవా), పురుషుల వ్యక్తిగత విభాగంలో ఇంద్రజిత్(ఎబిపిఎస్ సిబి), వినాయక్ యం.కొంగి(కర్ణాటక), తన్మేఅధికారి(ఉత్తరాఖండ్), బ్యాక్ బెండింగ్ మహిళల వ్యక్తిగత విభాగంలో అర్చన కవాటేకర్ (మహారాష్ట్ర), బిన్నీకుమారి బాల (బీహార్), శీతల బైస్య (అస్సాం), పురుషుల వ్యక్తిగత విభాగంలో అయ్యంపిళ్లై (తమిళనాడు),బీరేంద్రకుమార్‌యాదవ్(హరియాణా), రాహుల్ శాండోర్(మహారాష్ట్ర)లు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

గ్రామంలోకి నీరు ప్రవేశించింది. ఎదురుమొండి తదితర గ్రామాల వద్ద కృష్ణానది ప్రమాదకరస్థితిలో ప్రవహిస్తోంది.

అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు

కృష్ణానదికి వరద హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ సోమవారం మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో పర్యటించారు. తొలుత పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన వరద ఉధృతిపై జలవనరులశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బొబ్బర్లంక, కే.కొత్తపాలెం గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించగా, ఆయా గ్రామాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి 6.84 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే లంక గ్రామాల్లోని 101 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు. తోట్లవల్లూరు మండలంలోని లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 22 బోట్‌లను సిద్ధం చేశామన్నారు. మోపిదేవి, పెనమలూరు, నాగాయలంక మండలాల్లో ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వరద ఉధృతి కొన్ని రోజులపాటు కొనసాగే అవకాశం ఉండటంతో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముంపునకు గురైన పసుపు, కంద, అరటి తోటల్లో పంటనష్టం అంచనాలను తయారు చేయాలని ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

\- పులిగడ్డ పల్లెపాలెం ప్రాంతంలోకి వరదనీరు రావటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పులిగడ్డ, రేగుల్లంక ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు.

\- చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురులో వరద ప్రవాహ పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ బాలాజీ తహసీల్దార్ డి.వనజాక్షితో మాట్లాడి తగు సూచనలు చేశారు. జలవనరులశాఖ కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, ఉద్యాన శాఖ అధికారులు కీర్తిదేవ్, రమేష్, ఏవో కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

\- చల్లపల్లి మండలం నడకుదురు, రాముడుపాలెం, నిమ్మగడ్డ, ఆముదార్లంక ప్రాంతాల్లో రేవులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుగా తాటిబొండులు, ముళ్లకంప వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

\- నాగాయలంకలోని చిన కరకట్ట కింద ఉన్న గృహాలు, రొయ్యల కంపెనీలు, చేపల కంపెనీలు, కోళ్ల ఫారాలు చుట్టూ వరదనీరు చేరింది.

నీట మునిగిన పంటలు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలోని లంకల్లో సోమవారం వరద తీవ్రతకు వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. కంద, అరటి, పసుపు, ఇతర కూరగాయ తోటలు వరదకు మునగటంతో రైతులు కలవరం చెందుతున్నారు. కాగా ఎనిమిది లంక గ్రామాల ప్రజలు వరద గుప్పిట్లో చిక్కుకున్నారు. 3,500 మంది ప్రజలు ఎనిమిది లంక గ్రామాల్లో నివసిస్తున్నారు. ఇప్పటి వరకు లంక గ్రామాల్లోకి వరద చేరలేదని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేసి అవసరమైతే లంక గ్రామాల ప్రజలను బయటకు తీసు కొచ్చేందుకు పడవలు కూడా సిద్ధంగా ఉంచామన్నారు.



తోట్లవల్లూరు లంకలో నీటమునిగిన పసుపుతోట



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న వైద్యబృందం

కదిలిన జిల్లా యంత్రాంగం

» డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైద్యబృందాల పర్యటన

అవనిగడ్డ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ 7, 8 వార్డుల్లో డయేరియా ప్రబలి పదిమందికిపైగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురాగా సోమవారం డీఎంఅండ్ హెచ్‌వో వెంకట్రావు ఆధ్వర్యంలో వైద్యబృందం సందర్శించి పరిస్థితిని అంచనావేశారు. జేడీ డాక్టర్ మల్లేశ్వరి, ఐడీఎస్పీ రాష్ట్ర అధికారిణి డాక్టర్ పద్మజ, డాక్టర్ హరిలు వార్డుల్లో పర్యటించి పరిస్థితిని అధ్యయనం చేశారు. ఈ నెల 22 నుంచే డయేరియా లక్షణాలతో పలువురు ఆసుపత్రిలో చేరినట్టు వైద్యబృందం పరిశీలనలో వెల్లడైంది. ఇప్పటి వరకు 24 డయేరియా కేసులు నమోదు కాగా, వారిలో ఆరుగురు డిశ్చార్జి అయ్యారని, ఇంకా 18 మంది చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి నిలకడగా ఉందని, ఆ ప్రాంతంలోని నీటి శ్యాంపుల్స్ సేకరించటంతోపాటు పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శేషుకుమార్, వేకనూరు పీహెచ్‌సీ అధికారి రాహుల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రాస్ క్లోవర్ లీఫ్ రహదారి నిర్మాణంపై పునఃపరిశీలన చేయండి

(5వ పేజీ తరువాయి)

అధికారులు నమూనాను తయారు చేశారని తెలిపారు. దీని వల్ల జాతీయ రహదారుల నిర్మాణానికి గతంలో ఇచ్చిన భూమిలో మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా పూర్తిస్థాయిలో తాము కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరిగితే నగరం మరింతగా విస్తరిస్తుందనే ముందుచూపుతో జాతీయ రహదారులను విస్తరించేందుకు గూడురు సమీపం నుంచి హర్ష కాలేజీ వరకు ఎలాంటి మలుపులు లేకుండా భూమిని జాతీయ రహదారుల అధికారులు ఇటీవల సర్వే చేశారని తెలిపారు. దీని ప్రకారం కేవలం ఆరు కిలోమీటర్లు దూరం వస్తుందన్నారు. అదే మచిలీపట్నం సమీపంలోని ఎస్‌ఎన్ గొల్లపాలెం సమీపం నుంచి చూస్తే 8.2 కిలోమీటర్ల మేర దూరం ఉందని తెలిపారు. గూడూరు సమీపం నుంచి జాతీయ రహదారి నిర్మాణం జరిగితే రహదారి నిర్మాణం, భూమి కొనుగోలు వ్యయం కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. బందరు పోర్టు నుంచి సరుకుల ఎగుమతులు, దిగుమతులు జరిగితే వాహనాలు నగరం సమీపంలోకి రాకుండా బయటి నుంచే రాకపోకలు సాగించే అవకాశం కూడా ఉందని వివరించారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లాడుతూ క్రాస్ క్లోవర్ లీఫ్ రహదారి నిర్మాణంపై పునఃపరిశీలన చేయాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్రను కూడా ఇటీవల కలిశామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన నమూనాలో మార్పులు చేసేందుకు వారు సూచనప్రాయంగా అంగీకరించినట్లు వివరించారు.

జన వరద

(5వ పేజీ తరువాయి)

నుంచి దర్శనానికి అనుమతించారు. తొలిదర్శనం ఈవో శీనానాయక్, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ చేసుకున్నారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. రూ.100, రూ.300 క్యూలను ఉచితంగా మార్చారు. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులను హోల్డింగ్ పాయింట్లలో ఏర్పాటుచేసిన కంపార్టుమెంట్లలో కూర్చోబెట్టారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా 30, వెనుక మరో 30 హోల్డింగ్ కంపార్టుమెంట్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లు ఖాళీ అయ్యాక ఒక్కో కంపార్టుమెంట్‌లోని భక్తులను వినాయకుడి గుడి వద్ద ఉన్న క్యూల్లోకి పంపారు. ఉదయం 8 గంటలకు 65,964 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. 9.30 గంటలకు 72,928 మంది, మధ్యాహ్నం ఒంటిగంటకు 1,02,685 మంది, అర్ధరాత్రి 12.30 గంటలకు రెండులక్షల మంది దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సతీసమేతంగా విచ్చేసిన సీఎంకుఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో అర్చన చేసిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆయన వెంట మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా

మూలానక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా రావడం సాధారణం. ఏయే ప్రాంతాల నుంచి ఎంతమంది భక్తులు దర్శనానికి వస్తున్నారన్న వివరాలను తెలుసుకోవడానికి పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్, సీతమ్మవారి పాదాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, కుమ్మరిపాలెం జంక్షన్, తదితర 17 ప్రాంతాల్లో డ్రోన్లను ఎగరవేశారు. అర్ధరాత్రి నుంచి రాత్రి వరకూ డ్రోన్లతో పర్యవేక్షించారు. రైళ్ల రాకపోకలను, టోల్‌గేట్లను మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లపై డ్రోన్లను ఉపయోగించి ప్రత్యక్ష ప్రసారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న వీడియో వాల్స్‌పై వీక్షించి భక్తుల రద్దీని అంచనా వేశారు. దాన్నిబట్టి హోల్డింగ్ పాయింట్ల వద్ద ఉన్న అధికారులకు సమాచారాన్ని చేరవేశారు.

న్యాయశాఖ అధికారులతో ఇబ్బందులు

మూలానక్షత్రం రోజున సాధారణ భక్తులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని అధికారులు ముందే చెప్పారు. వీవీఐపీ కేటగిరీలో వచ్చే వారికి ప్రొటోకాల్ ఇవ్వలేమని ప్రకటించారు. అంతరాలయ దర్శనాలను రద్దు చేశామని సమాచారం ఇచ్చారు. దీన్ని కొంతమంది వీవీఐపీలు పరిగణనలోకి తీసుకుని దర్శనాలను వాయిదా వేసుకున్నారు. న్యాయశాఖకు చెందిన కొంతమంది అధికారులు మాత్రం తమకు నచ్చిన సమయాల్లో వచ్చి ప్రొటోకాల్ ఇవ్వాలని ఒత్తిడి చేశారు. కొంతమంది తమకు అంతరాలయ దర్శనం జరగాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో దేవస్థాన అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో అంతరాలయ దర్శనాలు చేయించాల్సి వచ్చింది. దీనివల్ల రూ.300, రూ.100 క్యూల్లో భక్తులు ఇబ్బంది పడ్డారు.



వెంకమ్మ పేరంటాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు.. న్యూ సనత్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సరస్వతీ నమస్తుభ్యం..

ప్రసాదంపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలు అమ్మవారిని దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీ సరస్వతిదేవిగా సోమవారం అలకరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవస్థాన ఆవరణలో పిల్లలతో అక్షరాభ్యాసం నిర్వహించారు.

కానూరు: కానూరు న్యూ సనత్‌నగర్ రోడ్డు నెంబరు-5 లోని డీఎస్‌పీ వీధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిలిపిన అమ్మవారిని సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేతలు కొట్టి శ్రీను, రాజు, స్వర్ణలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కనకదుర్గ అలయం కమిటి సభ్యుడు వెలగపూడి శంకరబాబు, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టి సాయి పాల్గొన్నారు. **గన్నవరం:** పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో సోమవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి, నర్రా సురేష్, ధనలక్ష్మీ దంపతులు పూజలు చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమ్మవారిని దర్శించే ప్రత్యేక పూజలు చేశారు. జాస్తి నాగేశ్వరరావు అమ్మవారి శేషవస్త్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, గూడపాటి తులసిమోహన్, కాసన్నేని రంగబాబు పాల్గొన్నారు. **కంకిపాడు:** కంకిపాడులోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో కన్యకపరమేశ్వరి అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. సుమారు 250 మంది విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఉప్పలూరు, మద్దూరు, కంకిపాడు శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు భక్తులకు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **ఉయ్యూరు :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సరస్వతి దేవిగా ఉన్న అమ్మవారిని దర్శించు కునేందుకు భక్తులు వేకువ జామునుంచి తరలివచ్చారు. కడవకొల్లు, చినఓగిరాల, కాటూరు సరస్వతీదేవికి పూజలు చేశారు. **హనుమాన్‌జంక్షన్ :** శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం మూలా నక్షత్రం పురస్కరించుకొని రాజరాజేశ్వరీదేవిని విద్యాలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆలయ ట్రస్టీ కాకాని అరుణ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బాపులపాడు శివాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చారు. **హనుమాన్‌జంక్షన్ రూరల్:** మడిచర్లలోని మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారిని మహిళలు, చిన్నారులతో కలిసి దర్శించుకున్నారు. వీరవల్లి షిరిడిసాయి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రావిశ్రీరామ్, కుసుమ దంపతులు ప్రత్యేక పూజ నిర్వహించారు. మల్లవల్లిలో అక్కినేని చైతన్య, శ్వేత దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రంగన్నగూడెంలో నిర్వహించిన పూజలో 50మంది, మల్లవల్లిలో 42మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరవల్లిలో కోడెబోయిన బాబి ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేశారు. **ఉంగుటూరు :** లంకపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఆత్కూరు శ్రీకనదుర్గాదేవి, గాయత్రీదేవి ఆలయం, పెదఅవుటపల్లి, నాగవరప్పాడు, మానికొండ, తరిగొప్పల శివాలయాల్లో జ్ఞానప్రదాయినిగా దర్శనమిస్తున్న శ్రీశారదాదేవిని భక్తులు దర్శించి సామూహిక కుంకుమార్చనలు జరిపారు.

రిటైర్డు చీఫ్ ఇంజనీర్ అట్లూరి నారాయణరావు మృతి

భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు గద్దె, బోడె



నారాయణరావు (ఫైల్)

కానూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అవార్డు గ్రహీత, విజయవాడ వీటీపీఎస్ రిటైర్డు చీఫ్ ఇంజనీర్ అట్లూరి నారాయణరావు (90) ఆదివారం రాత్రి విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. కానూరులో నివాసం ఉంటున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య రత్నాంబ, కూతుర్లు ఉమాదేవి, అన్నపూర్ణలు ఉన్నారు. ఆయన అల్లుడు చలసాని రమేష్(రవి) కాశేశ్వరీ ట్రావెల్స్‌ను నిర్వహిస్తుండగా రెండవ అల్లుడు వ్యాపారవేత్త. కాగా నారాయణరావు భౌతికకాయాన్ని సోమవారం ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతిని తెలిపారు.

ఉత్తమమైనది గురు-శిష్య బంధం

కానూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజ ధర్మంలో గురు-శిష్య సంబంధం ఎంతో ఉత్తమమైనదని, దానికి అనుగుణంగా విద్యాబోధన సాగాలని ఇస్కాన్ విజయవాడ అధ్యక్షుడు స్వామి చక్రధారి దాస్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన దసర ఉత్సవాలు, మూలా నక్షత్రం, సరస్వతీ పూజ కార్యక్రమాల్లో స్వామి చక్రధారిదాస్ పాల్గొని సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలువేసి నమస్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, డైరెక్టర్ పాండురంగారావు, సాయిబాబు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దంటగుంట్లలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతు అప్పారావు కుటుంబాన్ని పీఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ సోమవారం పరామర్శించారు. ప్రమాద వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. తన వంతు సహాయంగా పీఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యజ్ఞవరపు శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పల్లి రవిబాబు, లవేటి వెంకటేశ్వరరావు, దానకర్ణ, బీజేపీ నాయకుడు నిడమర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు వరం

పెనమలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీ పన్నుల ద్వారా ప్రజల సొమ్ము చాలావరకు ఆదా అవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సూపర్ జీఎస్టీ పథకం సామాన్య ప్రజలకు ఊతమిచ్చేలా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ బాలాజీబాబు, జాయింట్ కమిషనర్ కల్పన, పెనమలూరు అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీ మాధవి, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ వాహనాల వేలం రేపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ సురేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎక్సైజ్ కార్యాలయంలో అక్టోబరు 1వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారని, వివరాలకు 9133337835 ఫోన్ నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

హరేరామ హరేకృష్ణ జపంతో సర్వపాప హరణం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సారాంశం ప్రతి మనిషిలో సాత్వికతను పెంచడానికి దోహదపడతుందని హరేకృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షుడు శ్రీమాన్ వంశీధర దాస ప్రభుజీ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో వాసవీమాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వంశీధర దాసప్రభుజీతో సత్సంగ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుజీ భగవద్గీత సారాంశాన్ని వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530


మంత్రి సారథికి స్వామి చిత్రపటం ఇస్తున్న దేవస్థానం చైర్మన్ వేమూరి

అభయాంజనేయస్వామి సన్నిధిలో మంత్రి సారథి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం దర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని విజయవాడ వెళుతూ మార్గమధ్యలో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నూతన పాలక మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వేమూరి శ్రీనివాసరావుకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు మంత్రి పేరిట అర్చనలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు స్వామి శేషవస్త్రంతో మంత్రిని సత్కరించి చిత్రపటం బహూకరించారు. పాలక మండలి సభ్యులు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


పాలకమండలికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

స్వామి ప్రతిష్టను మరింత పెంచాలి

● ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచేందుకు పాలకమండలి కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఆలయం వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని పాల్గొని నూతన పాలక మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వేమూరి శ్రీనివాసరావు, సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా చింతమనేనితో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సభలో చింతమనేని మాట్లాడుతూ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేవస్థానం మరింత పురోభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, ఏపీ తూర్పు కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గరికపాటి నాగేశ్వరరావు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబునాయుడు, ఈవో తారకేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు సాధించినవారికి నియామక పత్రాలు ఇస్తున్న అధికారులు

సీఆర్‌డీఏ స్పెషల్ డ్రైవ్ జాబ్‌మేళా

● ఎనిమిది మందికి ఉద్యోగాలు

కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో స్పెషల్ డ్రైవ్ జాబ్‌మేళా జరిగింది. భవ్య హెల్త్ సర్వీసెస్, టీయూవీ ఇండియా, మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. 40కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నిర్వహించిన జాబ్‌మేళాకు 45 మంది అభ్యర్థులు హాజరుకాగా 8 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలిసి సీఆర్‌డీఏ సామాజిక సంక్షేమ విభా గ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి, సీఆర్‌డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్‌మేళాను సమర్థవంతంగా నిర్వహించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియను సాఫీగా నిర్వహించడం జరిగింది.

అర్చకుడు ఆత్మహత్య



నెమలి (గంపలగూడెం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయం అర్చకుడిగా, సేవలందిస్తున్న డీ వేణుగోపాలాచార్యులు (55) ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఆదివారం రాత్రి 8 గంటలకు ఆలయానికి తాళం వేసి, ద్విచక్రవాహనంపై అనురాధవాగు వంతెన వద్దకు వెళ్లి, తన వస్తువుల్ని వాహనంలో పెట్టి వంతెన పైనుంచి వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. రాత్రయినా భర్త గుడి నుంచి ఇంటికి రాకపోవడంతో భార్య కరుణశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా బ్రిడ్జిపై మృతుడి వాహనం, వస్తువులు లభించడంతో, వైరా నుంచి గజ ఈతగాళ్లను రప్పించి, వాగులో గాలింపు నిర్వహించారు. సాయంత్రానికి వాగు నుంచి వేణుగోపాలాచార్యులు మృతదేహం బయటికి తీశారు. మృతుడి భార్య నెమలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్సై ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

విజయవాడ డివిజన్‌లో టికెట్ చెకింగ్ డ్రైవ్

● అత్యధికంగా రూ.35.16 లక్షల జరిమానాల వసూలు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ బీ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక టికెట్ చెకింగ్ డ్రైవ్ ద్వారా రూ.35.16 లక్షల ఆదాయం సమకూరినట్లు డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూప్‌కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.132 మంది టికెట్ చెకింగ్ స్టాఫ్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఒకరోజు తనిఖీలోనే 4,097 కేసులు నమోదయ్యాయి. డివిజన్ పరిధిలో మొత్తం 196 రైళ్లలో తనిఖీలు నిర్వహించారు.


ప్రయాణికుల టికెట్లను తనిఖీ చేస్తున్న టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు

ఇందులో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 2257 మందిని గుర్తించారు. 2321 మంది తాము ప్రయాణించాల్సింది ఒకచోటుకైతే మరోచోటుకు ప్రయాణిస్తున్నారు వారి నుంచి వరుసగా రూ.22.89 లక్షలు, రూ.12.19 లక్షల చొప్పున జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ టికెట్ చెకింగ్ కేవలం డబ్బుల కోసమే కాదని, ప్రయాణికుల్లో అవగాహన కల్పించడం కూడా ఒక ఎత్తని తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న సిబ్బందిని టీటీఈ అభినందించారు



పున్నమిలో దుమ్మురేపిన పోటీలు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమిఘాట్‌లో సోమవారం నిర్వహించిన విజయవాడ ఐడియల్, విజయవాడ చాంప్స్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. నగరానికి చెందిన పలువురు చిన్నారులు ఇచ్చిన కళా ప్రదర్శన ఆహూతులను అలరించింది. సోలో, గ్రూప్స్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. దీక్షిత్ ఫ్లూట్ సంగీతంతో, వెంకటేష్ భక్తిగీతంతో,, సంతోష్ తమన్ వయోలిన్ తో , రెహాన్ డ్రమ్స్‌తో, ఆనంద్ చంద్రిక నాట్యంతో, సాహితీ, ప్రధాన్య, త్యాగప్రియ భక్తి జీతాలతో, రిషిల్, వేదాన్ష్ హర్షిణి సినీ భక్తిగీతాలతో అలరించారు నలంద విద్యా నికేతన్ చిన్నారులు మాతంగీ అవతారం కట్టి అమ్మో రేణుక తల్లి పాటకు చేసిన నృత్యం వేదికను దుమ్మురేపింది. వీపీఎస్ టీమ్, తన్మయి బృందం కూచిపూడి నృత్యంతో, విష్ణు వర్ధన్ నాద స్వరంతో, సాయి మంజుల గ్రూప్ అకాడమీ బృందం, శ్రీ మ్యూజిక్ ఇన్స్టిట్యూట్ టీం బ్యాండ్‌తో ఆకట్టుకున్నారు. ఐడియల్ పోటీలకు వెయ్యి మంది, చాంప్స్ పోటీలకు 600 మంది పోటీపడ్డారని, వీరికి ఆడిషన్స్ నిర్వహించి ఐడియల్ విభాగంలో 12 మందిని, చాంప్స్ విభాగంలో ఆరుగురిని ఫైనల్ పోటీకి ఎంపిక చేసామని నిర్వాహకులు తెలిపారు.

విజేతలు వీరే:

విజయవాడ చాంప్స్ పోటీల విజేతగా నలంద గ్రూప్ రన్నర్‌గా తన్మయ గ్రూప్ నిలిచి బహుమతులు అందుకున్నారు.

ఐడియల్ పోటీల క్యాటగిరి విజేతగా రెహ్మాన్, రన్నర్‌గా మైథిలి ట్రోఫీలను అందుకున్నారు. విజేతలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ బహుమతులు అందజేశారు.



సమ్మోహనోత్సవ్

మంత్రముగ్ధుల్ని చేసిన మెలోడీ బ్రహ్మ మణిశర్మ ● డ్యాన్స్ చేసిన యువత



(ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్/విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం/గొల్లపూడి): మెలోడి బ్రహ్మ మణిశర్మ ఆడియన్స్‌ను మంత్రముగ్ధుల్ని చేశారు. రెండు భక్తి పాటలకు భక్తులు పరవశించిపోయారు. తర్వాత యువతను ఉర్రుతలూగించే బాణీలు మొదలు కావడంతో మణిశర్మను చూసేందుకు, ఆయన అందించే బాణీలు వినేందుకు యువత స్టేజ్ ఎదుటకు వచ్చేశారు. యాంకర్‌తో పాటు కలిసి స్టేజ్ ఎదుట మణిశర్మ బాణీలకు చిందేసి సందడి చేశారు. గొల్లపూడి ఎగ్జిబిషన్‌లోని విజయవాడ ఎక్స్‌పోలో సోమవారం జరిగిన మణిశర్మ మ్యూజిక్ కన్సర్ట్ ఆద్యంతం ఆడియన్స్‌ని అలరించింది. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ మణిశర్మ అందించిన బాణీలకు ఆయన టీమ్ పాడిన పాటలను ప్రత్యక్షంగా వీక్షించిన విని ఆనందించారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

నాట్యాచారిణి శ్రీ వత్సల, శ్రీ లలిత ఐశ్వర్యాబింకా నృత్య కళాక్షేత్రం శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. జయం జయం అంటూ గణపతి స్తుతితో ప్రారంభించి మరకతమణిమయ" తరంగం" అంశం, మహిషాసుర మర్దిని కీర్తనలకు చూడచక్కగా నర్తించి రంజింపజేశారు. ఇవ్వల ఏసురాజు (ఐవీ రాజు) క్లారినెట్ సంగీత వాద్య కచేరితో శ్రోతలను పరవశింపజేసింది. వీరికి కంకటాల శ్రీనివాస్ సహకార క్లారినెట్, ఇలపకుర్తి శ్రీనివాస్-డోలు, మురళీ ప్రసాద్-తబలా, కే ప్రసాద్-తాళంతో వాద్య సహకారం అందించారు. ఉయ్యూరుకు చెందిన రాజీవ్ సోదరుల డప్పుల విన్యాస ప్రదర్శనలు వీక్షకులను ఉర్రూతలూగించాయి. కాకినాడకు చెందిన 'తోట అన్నవరం' బృందం ప్రదర్శించిన రామాయణపు ఇతివృత్తంపై తోలుబొమ్మలాట ఆకర్షణీయంగా సాగింది.

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో..

నగరానికి చెందిన కావ్య శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన నయనానందకారంగా సాగింది. శ్రీకాకుళానికి చెందిన శెట్టి రాజు బృందంతో తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. చిప్పాడ నాగేశ్వరావు ఘంటసాల సంగీత విభావరి అలరించింది. కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గొర్రెల రాము బృందంతో బుర్రకథ - మహాభారతంలోని ఉత్తర కల్యాణం గానం చేశారు. జి రాము, జి శ్రీనివాసులు వంతపాడగా జి కృష్ణమూర్తి కథను గానం చేశారు. గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ బృందం ఇచ్చిన సాంఘిక నాటికం "పాప దొరికింది" సందేశాత్మకంగా సాగింది.

ఇంద్రకీలాద్రిపై..

జగన్మాత దుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రంరోజున దేవస్థానం కళావేదికపై చదువులతల్లి,



కళామతల్లిరూపంలో దర్శనమిస్తున్న కల్పవల్లికి కళాకారులు తమ కళా నీరాజనాలర్పించారు. నగరానికి చెందిన నాగయ్య బృందం తాళం భజన, ప్రసాద్ బృందం భక్తి సంగీతం,సాహితీ, వైష్ణవి, వైదేహి,కావ్య బృందాలు భక్తి రంజని నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు భాగవతార్ - పార్వతీపరిణయం హరి కథను రాగ యుక్తంగా గానం చేశారు. పావని, సాయి నిహారిక, భాగవతుల వెంకట రామ శర్మ, ఎం అనూష నాయుడు బృందాలు సంప్రదాయనృత్యాలు ప్రదర్శించారు. నగరోత్సవంలో నగరానికి చెందిన ఎన్ రోహిణి బృందం ప్రదర్శించిన కోలాటనృత్యములు, చెక్క భజనలు భక్తులను భక్తి పథంలో నడిపించాయి. తెనాలికి చెందిన బాలాత్రిపుర సుందరి, సాహితీ లక్ష్మి, హైదరాబాద్‌కు చెందిన విజయవల్లి, నెల్లూరుకు చెందిన పాత్రుడు బృందాలు కూచిపూడి నృత్యాలను ప్రదర్శన చేశారు. దేవస్థానం నుంచి ప్రతి ఒక్క కళాకారునికి ప్రశంసా పత్రం, అమ్మవారి ప్రసాదం, బృందగురువుకు శేష వస్త్రం, జ్ఞాపిక అందిస్తున్నారు. కళా బృందం అందరికి అమ్మవారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. పీఆర్వో గంగాధర్, సైదా పర్యవేక్షించారు.

పవిత్ర సంగమంలో..

నాట్యాచార్య సప్పా శివకుమార్ బృందం 25 మంది విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకులతో ఆడి పాడించాయి. హైదరాబాద్‌కు చెందిన నాట్యాచారిణి జానకి 13మంది విద్యార్థులతో చేసిన ఆంధ్ర నాట్యం ప్రదర్శనలు నటరాజతత్వాన్ని సాక్షాత్కరింపజేశాయి. చివరిగా హైదరాబాద్‌కు చెందిన యలవర్తిపాటి శ్రీనివాస్ ప్రదర్శించిన ఇంద్రజాలం భళారే అనిపించింది. అనంతరం కళాకారులను కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్ను బోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్య కీర్తన సత్కరించి జ్ఞాపిక సర్టిఫికెట్లు అందజేశారు.



విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

గొల్లపూడిలో..

మిస్ విజయవాడ ఫైనల్,
కాంతార మూవీ టీం అండ్ గ్రీట్

పున్నమిఘాట్‌లో..

సాంస్కృతిక ప్రదర్శనలు,
దామేలెన్స్ స్వాప్ ది
బీట్ లైవ్ కన్సర్ట్,
దాండియా డీజే

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

గంగాధర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన
సాహితి సంగీత కచేరీ
వెంకటేశ్వర్లు హరికథ
వీబీఎస్‌వీ కుమార్ బృందం గరగలు జానపద నృత్య ప్రదర్శన
చారిత్రాత్మక పద్య నాటకం శ్రీ ఖడ్గ తిక్కన

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో..

చింత వెంకట సీతారామాంజనేయుల శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన
6.30 గంటలకు సంగీత కచేరీ
7.00 గంటలకు సీహెచ్ అజేయ్‌కుమార్ కూచిపూడి నృత్య ప్రదర్శన
7.30 గంటలకు పల్నాడుకు చెందని వెంకట్ బృందం తోలుబొమ్మలాట
8.00 గంటలకు నగరానికి చెందిన గంగాధర్ వెంట్రిలాక్విజం, మ్యాజిక్ ప్రదర్శన
8.30 గంటలకు మానవత, యడ్లపాడు వారితో బావా ఎప్పుడు వచ్చితివి? సాంఘిక నాటకం.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సందడి

రాష్ట్ర ప్రభుత్వం, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడిలో నెలకొల్పిన విజయవాడ ఎగ్జిబిషన్ లో కేంద్ర పౌరవిమానయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సందడి చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి సోమవారం ఎగ్జిబిషన్ ను సందర్శించారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ పెవిలియన్ లో కొన్ని స్టాల్స్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం అభివృదిక్కి పెద్ద పీట వేస్తున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీని అధ్యయనం చేయటానికి , అగ్రికల్చర్ పెవిలియన్ రైతులకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ సభ్యులు ముత్తవరపు మురళీ కృష్ణ, అనిల్ సుంకరలతో పాటు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు


కలెక్టరేట్‌లో మీకోసం అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికలోని అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలోని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కేఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డీవో కే స్వాతితో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీకోసం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు చేరిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ మాట్లాడుతూ, పోలీసుశాఖకు సంబంధించి పరిష్కరించాల్సిన అర్జీలు అత్యధికంగా ఉన్నాయని, దృష్టిపెట్టాలని సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన ధరలపై అవగాహన ప్రచారం నిర్వహించి చేసిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్కువ జీఎస్టీ ధరలతో పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తు సేవల పన్ను తగ్గింపు జీఎస్టీ 2.0 ధరలతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలను కోరారు. సోమవారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డీవో కే స్వాతి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ రవికాంత్‌తో కలిసి నిత్యావసర సరుకులకు సంబంధించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తగ్గించిన జీఎస్టీ ధరలతో తక్కువ ధరకే లభిస్తాయని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని కలెక్టర్ కోరారు.

జోగి.. నానా యాగీ

● ఎమ్మెల్యేలు బాలకృష్ణ, వసంత కృష్ణప్రసాద్‌పై వైసీపీ నేత కోటేశ్వరరావు అనుచిత పోస్టులు
● టీడీపీ నేతల ఫిర్యాదుపై స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు
● కోటేశ్వరరావును విడుదల చేయాలని సీఐ కార్యాలయం ఎదుట జోగి బైఠాయింపు
● అధికార పార్టీకి, ఎమ్మెల్యే వసంతకు తొత్తులుగా పనిచేస్తున్నారంటూ ఆగ్రహం
● ఫిర్యాదు చేసినవాడు ఎవడంటూ పోలీసులతో వాగ్వాదం

మైలవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మైలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి కోమటి కోటేశ్వరరావును విడుదల చేయాలంటూ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని సీఐ కార్యాలయం ముందు సోమవారం మాజీ మంత్రి జోగి రమేశ్ ధర్నాకు దిగారు. ఈనెల 27న గొల్లపూడి ఎగ్జిబిషన్‌కు విచ్చేసిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కలిసి కూర్చున్న ఫొటోలను ఇబ్రహీంపట్నానికి చెందిన వైసీపీ కార్యకర్త కోమటి కోటేశ్వరరావు సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెట్టాడు. దీంతో అతడిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైలవరం స్టేషన్లో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కోటేశ్వరరావును సీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న జోగి రమేశ్ కొంతమంది కార్యకర్తలతో కలిసి సీఐ కార్యాలయానికి చేరుకున్నారు. కోటేశ్వరరావును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అధికార పార్టీకి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు తొత్తులుగా పనిచేస్తున్నారని ఎస్సై సుధాకర్‌తో వాగ్వాదానికి దిగాడు. మీకు ఎవడు ఫిర్యాదు చేశాడాంటూ వీరంగం వేశాడు. కోటేశ్వరరావుకు 41 నోటీసు అందజేసి పంపిస్తామని ఎస్సై చెప్పడంతో జోగి ఆందోళన విరమించాడు. పూర్తి విచారణ చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు.


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నేత జోగి రమేశ్

జోగి వ్యాఖ్యలను ఖండించిన తెలుగు మహిళలు

ఎమ్మెల్యే వసంతపై జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలను మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు పసుపులేటి రేణుక, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ షహనాబేగం తీవ్రంగా ఖండించారు. సోమవారం టీడీపీ పట్టణ కార్యాలయంలో మీడియా సమావేశంలో మహిళలు మాట్లాడుతూ జోగి రమేష్ అనుచరుడు తప్పు చేస్తే అతడి గురించి మాట్లాడకుండా తమనేత వసంతను ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే గొట్టంగాళ్లంటూ సంబోధించడం, పోలీసులపై దురుసు ప్రవర్తనను ఖండించారు. ప్రతిపక్ష నేతగా సమస్యలను ఎత్తిచూపాలే తప్పా గౌరవ ఎమ్మెల్యే వసంతపై వ్యక్తిగత దూషణలు చేస్తే చెప్పుతీసుకొని కొడతామని మహిళలు హెచ్చరించారు. పార్టీ మండలాధ్యక్షుడు జే గోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి దూరు బాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కరీందాదా, సొసైటీ అధ్యక్షుడు కరెడ్ల వెంకట నారాయణ, వజ్రాల కుమార్‌రెడ్డి, లంక లితీష్, చల్లా సుబ్బారావు, జల్లి కృష్ణ, కోడిరెక్కల వెంకయ్య, పరికెల సాంబయ్య, షేక్ బాజీ, బుడిపూటి వెంకట్రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ఘనంగా బతుకమ్మ సంబరాలు

పామర్రు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను టీడీపీ జిల్లా మహిళా కార్యదర్శి మైనేని ఇందిర ఆధ్వర్యంలో సోమవారం గోపువానిపాలెంలో వేంచేసియున్న బాలత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ప్రకృతిని ఆరాధించే విధంగా పలు రకాల పూలతో లోక కల్యాణార్థం బతుకమ్మ(గౌరమ్మ)ను వేడుకుంటూ జనపదా గేయాలతో ఆలయం దద్ధరిల్లింది. బతుకమ్మ సంబరాలు ఈప్రాంతంలో నిర్వహించిన ఇందిరను పలువురు అభినందించారు.



బతుకమ్మల సంబరాలు చేస్తున్న మహిళలు



ఎంఈఓకి వినతిపత్రం అందజేస్తున్న నాగవరప్పాడు వాసులు

పాఠశాలకు గేటు ఏర్పాటు చేయాలని వినతి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగవరప్పాడులోని ప్రభుత్వ పాఠశాల మెయిన్ రోడ్డు పక్కనే ఉందని, దానికి గేటు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు ఎంఈవో సీహెచ్.రజనీకి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల రెండు ఒకే ఆవరణలో ఉన్నాయని, పాఠశాల కూడా సక్రమంగా లేదని, ముఖ్యంగా గేటు అత్యవసరంగా ఏర్పాటు చేసి విద్యార్థులను కాపాడాలని కోరారు. హైవే పక్కనే పాఠశాల ఉండటం వల్ల గేటు లేకపోతే వేగంగా వచ్చే వాహనాలు వల్ల విద్యార్థులు రాకపోకల సమయాల్లో ప్రమాదాల బారీన పవే అవకావం ఉందన్నారు. ఎంఈవో రజనీ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. పెద్దిబోయిన వెంకటేశ్వరరావు, కొలుసు సురేష్, దాసరి సురేష్, ప్రసాద్, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు చట్ట పరిధిలో పరిష్కారం : ఏఎస్పీ

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలు ధైర్యంగా తమ సమస్యలు తెలియజేస్తే చట్టపరిధిలో పరిష్కరించడానికి పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఏఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 38 ఫిర్యాదులు రాగా అధికారులకు నేరుగా ఫోన్ చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పిల్లలు లేని కారణం గా అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని గుడివాడకు చెందిన వనజ ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని బంధువులు మోసం చేశారని అవనిగడ్డకు చెందిన కిషోర్, ఆస్తి కోసం కుమారులు వేధిస్తూ భోజనం పెట్టడం తోట్లవల్లూరుకు చెందిన నరసయ్య ఫిర్యాదు చేశారు.అధికారులకు ఫిర్యాదులను బదిలీ చేసి త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు.

పోషకాహారంపై అవగాహన

కూచిపూడి : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీపీ కొండేటి ఇందిరా పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని మొవ్వ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సుహాసిని, పాల్గొన్నారు.



గుడివాడలో..



గుడివాడ రూరల్‌లో..



కూచిపూడిలో..



పామర్రులో..



పెదపారుపూడిలో..



నందివాడలో..

సరస్వతీదేవీ నమోస్తుతే..



తోట్లవల్లూరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజైన ఆదివారం పలు దేవాలయాల్లోని అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. తొలుత దేవాదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. చిన్నారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల అక్షరాభ్యాసం చేయించి నోటు పుస్తకాలను అందజేశారు. దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ పట్టపు చిన్నా, పలు దేవస్థానాల కమిటీల ఛైర్మన్‌లు లింగం చిట్టిబాబు, హరిబాబు, జవ్వాజి గంగరాజు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, ఈవో గంగు శిరీషా, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, సత్యసాయి, సునీల్, నాగరాజు, ప్రకాష్‌దాసు, అల్లాడ శ్రీనివాస్, జనసేన నాయకులు త్రినాథ్, ఆంజనేయులు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోక కల్యాణార్థం మహా చండీ యాగం నిర్వహించారు. ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ నెరుసు బోసు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ అంగడాల సతీష్, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు విద్యాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ లింగం చిట్టిబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, హరిబాబు భక్తులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, సకల విద్యాభివృద్ధికి సరస్వతీ మూలమంత్ర హవనం నిర్వహించారు. సరస్వతీ అమ్మవారికి విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజల్లో వేలాదిగా విద్యార్థులు పాల్గొని అమ్మవారిని ప్రార్థించారు. పూజల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆలయ ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు,ఆలయ ఈవో కొండలరావు పుస్తకాలు,పెన్నులు,పెన్సిల్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఆదివారం అమ్మవారిని కైకలూరు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు తదితర ప్రముఖులు దర్శించుకోగా వారిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని నిర్వాహకులు బహూకరించారు. గంగా పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామివారి ఆలయంలోని సరస్వతీ అమ్మవారికి అభిషేకాలు చేశారు. లక్ష పూలతో అర్చన సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు.

స్థానిక బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో కాళహస్తీశ్వరస్వామి వారి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు ఆలయ ఈవో గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ బుడమా వీర్రాజు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా కొలువై ఉన్నారు. అమ్మవారు సరస్వతీ దేవిగా కొలువై ఉన్నందున వందలాది మంది భక్తులు, విద్యార్థులు, బాలబాలికలు హాజరయ్యారు. విద్యార్థులకు ఆలయ ట్రస్టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలు, పలకలు అందించారు.

కూచిపూడి : కూచిపూడి, పెదపూడి, మొవ్వ, నిడుమోలు, అయ్యంకి, భట్లపెనుమర్రు, పెడసనగల్లు, మొవ్వపాలెం గ్రామాల్లో దేవాలయాల్లో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు.

నందివాడ : నందివాడ, జనార్ధనపురం, తుమ్మలపల్లి, లక్ష్మీనరసింహాపురం, కుదరవల్లి, పోలుకొండ, నాగభూషణపురం, తమిరిశ, పుట్టగుంట గ్రామాల్లో దుర్గాదేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

పామర్రు: స్థానిక శివాలయంలో అమ్మవారు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవస్థానంలో సరస్వతీదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవస్థానంలో విద్యార్థుల చేత ప్రత్యేకంగా అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రానికి గల విశిష్టత తెలియజేస్తూ సరస్వతీ దేవికి పూజాదికాలు, కుంకుమపూజలు చేశారు.

పెదపారుపూడి: వానపాములలో రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయంలో 8వ రోజు సోమవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భద్రిరాజుపాలెం, వల్లూరుపాలెం శివాలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చింది. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

పామర్రు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అక్టోబరు ఒకటో తేదిన గ్రామాల్లో పంపిణీ చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు మండలాభివృద్ధి అధికారి కె.జ్యోతి అన్నారు. సోమవారం ఈ మేరకు మండలవ్యాప్తంగా ఉన్న 17గ్రామ సచివాలయ సాంఘిక సంక్షేమకార్యదర్శులతోపాటు, ఇతర అధికార్లను 30వతేదీ సెలవు దినం కావడంతో ముందస్తుగానే బ్యాంకుల నుంచి పింఛన్ల నగదు డ్రా చేసేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అక్టోబరు ఒకటోతేది ఉదయం ఏడుగంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్లను పంపిణీ చేస్తారని, పింఛన్ల లబ్ధిదారులు తమ ఇండ్లలో అందుబాటులో ఉండి సచివాలయ ఉద్యోగులకు సహకరించి పింఛన్ల నగదును అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమసహాయకులు వెంకట కిషోర్, పల్లవి, జ్యోతి, వైష్ణవి, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు వేతనాలు విడుదల

గుడివాడ రూరల్: మధ్యాహ్న భోజన పథకం కుకింగ్ ఏజెన్సీలకు రెండు నెలల వేతనాలు విడుదలయ్యాయని ఎంఈవో -1 సీహెచ్.రజని సోమవారం కార్యాలయంలో తెలిపారు. జూలై నెలలో రూరల్, అర్బన్ 140 కుకింగ్ ఏజెన్సీలకు రూ.4.15 లక్షలు, జూన్ నెలలో 134 కుకింగ్ ఏజెన్సీలకు రూ.2.10లక్షలు, ఏప్రియల్ నెలలో పెండింగ్ ఉన్న కుకింగ్ ఏజెన్సీలకు వారి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేసినట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలివ్వండి

సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ బేసిక్ చేస్తున్న ఎంఈవో కార్యాలయంలో 21 మంది ఉద్యోగులకు ఆగస్టు నెల వేతనాలు వేయలేదని సిబ్బంది తెలిపారు. మొత్తం 21 మందికి గౌరవ వేతనం ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రావాల్సి ఉందని తెలిపారు.

డీఎల్‌డీవో కార్యాలయం పరిశీలన

గుడివాడ రూరల్ : గుడివాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎల్‌డీవో కార్యాలయంలో ఫర్నీచర్, భవనం ఏ విధంగా ఉన్నాయో సోమవారం డీఎల్‌డీవో సునీతా శర్మ కార్యాలయాన్ని సందర్శించారు. అక్టోబరు 2వ తేదీన ప్రారంభానికి సిద్ధం కావాలని ఉన్నతాధికారుల ఆదేశం ఉన్నందున కార్యాలయ భవనం పరిశీలించి మార్పులు, చేర్పులకు సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రాత్రి గుడ్లవల్లేరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త కాలనీ, చంద్రన్న కాలనీలకు ప్రధాన రహదారికి ఏ ర్పాట్లు మొదలయ్యాయన్నారు. అడ్డాడ-గుడ్లవల్లేరు రహదారి ఫ్లైఓవర్‌తో పాటుగా అండర్ పాస్ మంజూరైయిందన్నారు. గుడ్లవల్లేరులోని న్యూకాలనీకి డిప్యూటీ సిఎం పవనన్న కాలనీగా పేరు పెట్టాలని గుడివాడ ఎమ్మెల్యేని గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాముని కోరారు

తొలుత ఎన్‌టీఆర్, డాక్టర్‌బాబు విగ్రహాలకు పూలమాలలు వేసి భారీ బైక్ ర్యాలీగా ఎన్టీఆర్ కాలనీకి ఎమ్మెల్యే రాము వెళ్ళారు. అక్కడ రూ94.10 లక్షల జల్‌జీవన్ మిషన్ హర్‌ఘర్‌జల్ నిధులతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను రాము ప్రారంభించారు. అనంతరం జిల్లాపరిషత్ హైస్కూల్‌కు సర్వశిక్షా అభియాన్ నిధులు రూ. 13 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ హర్‌ఘర్ జల్ నిధులు రూ1.14 కోట్ల వ్యయంతో నిర్మించి మైక్రోవాటర్ ఫిల్టర్లు, ఇంటింటికీ టాప్ కనక్షన్లను రాము ప్రారంభించారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి,గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ,గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్,గ్రామపార్టీ అధ్యక్షులు రంగబాబు, సీనియర్‌నేత మోహనరావు,గుడ్లవల్లేరు పీఏసీఎస్ ఛైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తాగునీటిని మహిళకు అందజేసిన ఎమ్మెల్యే రాము

జీఎస్టీపై అవగాహన తప్పనిసరి

● జీఎస్టీ నోడల్ అధికారి సలాం

పామర్రు,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):భారత్ ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన సూపర్ జీఎస్టీతో అన్నివర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున మేలు జరగనున్నదని బందరు జీఎస్టీ,పామర్రు నియోజకవర్గ జీఎస్టీ నోడల్ అధికారి సలాం అన్నారు. సోమవారం జీఎస్టీ సంస్కరణల లాభాలను వినియోగదారులకు, దుకాణదారులకు వివరిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీడీవో కాంద్రు జ్యోతి, ఎంపీడీవో కార్యాలయ ఏవోటీ మారుతిరావు, డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ సలీం, పద్మశ్రీవేణి, నరేష్, బోసు,



అవగాహన కలిగిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్లు ఎం.సునీత, రంగమణి



ర్యాలీలోపాల్గొన్న నోడల్ అధికారి సలాం

తిరుమల, ఉమప్రతాప్, స్నేహలత, జీఎస్టీ చాంపీయన్లు స్వాతి, ఉదయలక్ష్మి, పవిత్ర, విజయలక్ష్మి, ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ కార్యదర్శులు కంఠమనేని పల్లవి, వైష్ణవి, వెంకటకిషోర్ పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక బస్టాండ్ వద్ద రవాణ, వాణిజ్య, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జీఎస్టీ తగ్గడం వల్ల జరిగిన లాభాలపై వాహనదారుకలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్లు ఎం.సునీత, రంగమణి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగీతరావు, ట్రాఫిక్ ఎస్సై పూడి నాగరాజు, ఏఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేడు

గుడివాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : గుడివాడ నడిబొడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి దళితుడు తరలిరావాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గౌరీశంకరపురంలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ సెప్టెంబరు 30వ తేదీన గుడివాడలో అడుగు పెట్టారన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో ఉదయం సభను నిర్వహించి, సాయంత్రం 5గంటలకు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, వెనిగండ్ల రాములు ప్రారంభిస్తారన్నారు. ప్రతి ఒక్క దళితుడు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పొంగులేటి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత నాయకులు దోనే కోటిబాబు, పంతగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పామర్రు నియోజకవర్గంలో రూ. 5కోట్లతో ఆలయాలు అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మంటాడలో అలిమేలుమంగా, పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల ఆవరణలో సోమవారం పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగస్త్యరాజు రామమోహనరావు, గంగిరె డ్డి శివరామకృష్ణప్రసాద్, పండలనేని రామలక్ష్మి, కొడాలి పిచ్చేశ్వరరావు, కాగితాల లక్ష్మి, మార్తి వెంకటరమణ, మోపిదేవి సంపూర్ణమ్మ, గరికి ముక్కు వెంకటేశ్వరరావు, అంబుల వెంకటేశ్వరరావు, గంగిరెడ్డి దివ్యభారతి, కుర్ర్రి రమణ, తిరువెంకట కృష్ణ రామానుజాచార్యులతో జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయ ఈవో వీడీడీ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశములో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం, ఇబ్బంది కలుగకుండా పాలక వర్గం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్, సనకా కిరణ్, రామారావు, రమణరాజ్ కుమార్ పాల్గొన్నారు. ఆలయ ఈవో హరిదుర్గాప్రసాద్, ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న మంటాడ వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు కమిటీ సభ్యులు

పంట నమోదు తప్పనిసరి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని రైతులందరూ వరి పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. సోమవారం మల్లాయిపాలెం తదితర గ్రామాల్లో ఈక్రాప్ నమోదు పరిశీలించారు. వీఏఏలు ఏ విధంగా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకుని పలు సూచనలు అందజేశారు. రైతులతో మాట్లాడుతూ తప్పనిసరిగా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం నమోదు చేయించుకున్నపుడు ఓటీపీ నెంబరు వస్తుందని, అది తెలిపితే పంట నమోదు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు

పామర్రు : ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని డివిజనల్ పంచాయతీ అధికారిణి పి.సంపత్‌కుమారి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని డీఎల్‌డీవో రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో అన్నిగ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులకు శానిటరీ కిట్లు, యూనిఫాం దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పామర్రు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో స్నేహలత, పామర్రు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, అన్నిమండలాల్లోని గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

గుడివాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ ఎదురుగా గల కిన్నెర కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రుణమేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వ్యాపార, ఇంటి, వాహనాల కొనుగోలుకు రుణాలను నేటి నుంచి అక్టోబరు 31వ తేదీవరకు తక్కువ వడ్డీతో మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ గుడ్లవల్లేటి మోహన్‌కుమార్, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530	

మంత్రి రవీంద్ర శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గాష్టమి, విజయదశమి సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గమ్మ చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని, రాష్ట్రం శుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కలెక్టర్ డీకే బాలాజీ కూడా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి కూలీ కుటుంబానికి బీమా చెక్కు

పెడన రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మడకలో ఇటీవల మరణించిన ఉపాధి పథకం కూలి అనగాని ఐలయ్య కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల బీమా చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. ఎంపీడీవో అరుణకుమారి, శీరం ప్రసాద్, వజీర్ పాల్గొన్నారు.

ఈలచెట్లదిబ్బకు తాగు, సాగునీరు విడుదల

నాగాయలంక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈలచెట్లదిబ్బ గ్రామానికి బాపట్ల జిల్లా రాజు కాల్వ ఎత్తిపోతల పథకం నుంచి సోమవారం నీరు విడుదల చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు అవనిగడ్డ వెంకటేశ్వరరావు, సభ్యులతో కలిసి స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేశారు. నీటి విడుదల వ్యవహారంలో ఈలచెట్లదిబ్బ, లంకెవానిదిబ్బ గ్రామాల మధ్య వివాదం నెలకొనగా అధికారులు రెండు గ్రామాల ప్రజలను సమావేశపర్చి రాజీ కుదర్చడంతో ఈలచెట్లదిబ్బకు సాగు, తాగునీరు విడుదలకు మార్గం సుగమం అయింది.



బందరు, పెడనలో సరస్వతీదేవికి సామూహిక పూజ చేస్తున్న విద్యార్థులు



నరసింహాపురం రామాలయంలో..

చదువుల తల్లికి వందనం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మూలా నక్షత్రం సందర్భంగా మచిలీపట్నంలోని ప్రధాన దేవాలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. హిందూ కళాశాల హైస్కూల్‌లోని సరస్వతీ మందిరంలో, వాసవీ భవన్ విద్యార్థులు సామూహిక పూజలు జరిపారు. రాబర్ట్‌సన్‌పేట రామలింగేశ్వర స్వామి, నాగేశ్వరస్వామి, బచ్చుపేట మల్లేశ్వర స్వామి, ఈడేపల్లి శక్తి గుడి, భాస్కరపురం త్రిశక్తిపీఠం, రుస్తుంబాద శివాలయం, కన్యకా పరమేశ్వరీ దేవి, బచ్చుపేట కరుమారిఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. సన్నిధి నాగసాయి, మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, వెత్స సత్యనారాయణమూర్తి, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన** : పైడమ్మ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శివదత్త ఉభయదాతలు యర్రా శ్యామలరావు, నిర్మల దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈవో జి.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాసు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. **ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు సోమవార పలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ దంపతులకు ఆలయాల నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.** **పెడన రూరల్** : ఉరివి గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. మడకలో గంగా పార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి, చెన్నూరు గంగా పార్వతి సమేత నారద లింగేశ్వర స్వామి, ఉప్పలకలవగుంట, నడుపూరు, నందిగం, లంకలకలవగుంట, బల్లిపర్రు, చోడవరం శివాలయాలలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంచారు. **చల్లపల్లి** : అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీపురం దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ ఆలయం, నడకుదురు పృథ్వీశ్వరస్వామి క్షేత్రం, రామానగరం క్లబ్‌రోడ్, చల్లపల్లి రాజ్యలక్ష్మి హాస్పటల్ బజారులో, సాయినగర్ కాలనీలో, మంగళాపురం టీఎన్‌టీయూసీ నేత చంద్ర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నడకుదురులో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి విశేషపూజలు చేయగా, పలకలు, పుస్తకాలు, పెన్నులు ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. **గూడూరు** : గూడూరులో మహాలక్ష్మీ అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు బహూకరించారు. **నాగాయలంక** : గణపేశ్వరం దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతుల ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కన్యకా పరమేశ్వరి, పార్వతీ దేవి, దుర్గమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసాలను చేయించారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలోకనకదుర్గ, వేకనూరులోని అంకాలమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **మోపిదేవి** : పెదకళ్లేపల్లిలోని దుర్గానాగేశ్వరస్వామి ఆలయం, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, కె.కొత్తపాలెం దుర్గా కోటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రావివారిపాలెం నూకాలమ్మ ఆలయంలో మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి 50 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. జొన్నలగడ్డ రామకృష్ణ ప్రసాద్ చిన్నారులకు అవసరమైన విద్యాసామాగ్రిని వితరణగా అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పెదకళ్లేపల్లిలోని దుర్గానాగేశ్వరస్వామి వారి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు, చెన్నకేశవలు ఆయనను శేషవస్త్రాలతో సత్కరించారు. **కోడూరు** : విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ, కోడూరు, నరసింహాపురంలో కనకదుర్గమ్మ, గంగానమ్మ అమ్మవార్లు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. విద్యార్థులు, మహిళలచే ఆలయాల ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు జరిపి, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

వాసవీ ఇంజనీరింగ్‌లో దసరా వేడుక



పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కుమారి ఏలూరి కీర్తి ప్రశాంతి దసరా విశిష్టతను వివరించారు. సరస్వతీ దేవి, వాసవీ మాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రయోగశాలలలో ఆయుధ పూజ నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విచిత్ర వేషధారణలతో సందడి చేశారు. కళాశాల చైర్మన్ జి.మెహర్‌ప్రసాద్, కార్యదర్శి టి.మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ఈడీ డి బాబా, ప్రిన్సిపాల్ బిఆర్‌ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజారమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవికె ప్రసాద్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీని తగ్గించడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని, దీని వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట చేకూరుతుందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీని కలెక్టర్ బాలాజీ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. జేసీ నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, రవికాంత్ పాల్గొన్నారు. **కోడూరు** : జీఎస్టీ తగ్గింపుపై ప్రతి కుటుంబానికి రూ.15 వేల వరకు లబ్ధి చేకూరుతుందని జీఎస్టీ ఆఫీసర్ స్వరూప తెలిపారు. వెలుగు కార్యాలయం వద్ద ఎంపీడీవో సుధా ప్రవీణ్ అధ్యక్షతన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

సాలిపేట చర్చి వార్షికోత్సవం

చల్లపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సాలిపేటలో ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు క్రీస్తు శాంతి సందేశాలను అందించారు. విచారణ గాయక బృందం ప్రార్థనాగీతాలు ఆలపించారు. ఫాదర్ బిరుదుగడ్డ రవికుమార్ ఆధ్వర్యంలో జోసెఫ్ రాజారావును ఘనంగా సత్కరించారు. వందలాది మంది విశ్వాసులకు ప్రేమవిందు జరిగింది.



ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వస్తువుల వాడకాల వల్ల వచ్చే అనర్థాలను తెలియచేయాలని, ప్లాస్టిక్ రహిత నగరంగా రూపొందించేందుకు అందరూ కృషి చేయాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు అన్నారు. రైతుబజార్ వద్ద అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, పి.వి. ఫణికుమార్, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం, రైతుబజార్ వద్ద వీధులు ఊడ్చారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : ఏఎస్పీ

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలు ధైర్యంగా తమ సమస్యలు తెలియజేస్తే చట్టపరిధిలో పరిష్కరించడానికి పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఏఎస్పీ అడ్మిన్ వి.వి. నా యుడు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 38 ఫిర్యాదులు రాగా అధికారులకు నేరుగా ఫోన్ చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పిల్లలు లేని కారణం గా అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని గుడివాడకు చెందిన వనజ ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని బంధువులు మోసం చేశారని అవనిగడ్డకు చెందిన కిషోర్, ఆస్తి కోసం కుమారులు వేధిస్తూ భోజనం పెట్టడం తోట్లవల్లూరుకు చెందిన నరసయ్య ఫిర్యాదు చేశారు.

కలంకారీ క్లస్టర్‌ను వ్యతిరేకించిన వైసీపీ కౌన్సిలర్లు

• వాడివేడిగా పెడన కౌన్సిల్

పెడన, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన సోమవారం జరిగిన పెడన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. కలంకారీ క్లస్టర్ ఏర్పాటు కోసం స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశంపై జనసేన కౌన్సిలర్ మట్టా శివపావనికి, వైసీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వావాదం జరిగింది. వైసీపీకి చెందిన వైస్‌చైర్మన్ ఎండి ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మెట్ల గోపీప్రసాద్, గరికముక్కు చంద్రబాబు మాట్లాడుతూ, కలంకారీ క్లస్టర్ ఏర్పాటు కోసం చూపించిన స్థలాలు ఇది వరకే ఇతర అవసరాలకు కేటాయించడం జరిగిందన్నారు. ఆ స్థలాలను కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తిరస్కరిస్తున్నామన్నారు. కలంకారీ కార్మికుల సంక్షేమం కోసం తలపెట్టిన క్లస్టర్ ఏర్పాటుకు స్థలాల కేటాయింపును వ్యతిరేకించడం శోచనీయమని శివపావని విమర్శించారు. శివపావనికి, వైసీపీ కౌన్సిలర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శివపావని, వైస్‌చైర్మన్‌ఖాజా పరస్పరం విమర్శలకు దిగారు. ప్రభుత్వమే నిధులు కేటాయించి క్లస్టర్ కోసం స్థలాలు కొనుగోలు చేయాలని వైసీపీ కౌన్సిలర్లు సూచించారు. పైడమ్మ సంబరాలలో వాహనాల పార్కిం గ్ ఫీజును వసూలు చేయవద్దని శివపావని సూచించగా, ఫీజును నిర్ణయించకపోతే అక్రమ వసూళ్లకు అవకాశం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా విషయమై మరోసారి శివపావనికి, వైసీపీ కౌన్సిలర్లకు మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని ఈ సమావేశంలో కూడా శి వపావని ప్రస్తావించడంతో సమావేశం వేడెక్కింది. వాగ్వావాదాలు, వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. చైర్‌పర్సన్ నాగకుమారి మా ట్లాడుతూ, మంచినీటి సరఫరా పారదర్శకంగా జరుగుతుందన్నారు. కౌన్సిలర్లకు మాత్రమే ఉచితంగా ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందిస్తున్నామని, ఇతరుల నుంచి చలానాలు కట్టించుకుని అందిస్తున్నామన్నారు. పురపాలక సంఘం ఆదాయాన్ని పెంచుకోవడానికి లే అవుట్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) మంచి అవకాశమని సభ్యులు పేర్కొన్నారు. అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణతో మునిసిపాలిటీకి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఈ స్కీమ్ గురించి అధికారులు విస్తృతంగా ప్రచారంచేయాలని సభ్యులు సూచించారు. అజెండాలోని అన్ని అంశాలను సమావేశం ఆమోదించింది. కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, మేనేజర్ మట్టా రాజా, టీపీవో సుజనకుమారి, ఏఈ రామాంజనేయులు, ఆర్‌ఐ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నారు.